# ప్రాప్తం?

**పెద్ద** కమ్మల ఇల్లూ, చుట్టూరా కాస్త జాగా, రెండెకరాల పొలం ఉన్నాయి రెడ్డికి. ఇవికాక అతనికి పెళ్లి కావలసిన కూతురు కూడా ఉంది. పెద్ద కూతురికి పెళ్లి అయిందనిపించేసరికి రెడ్డి నీరసించిపోయాడు. అప్పు ఆరోగ్యంగా పెరిగింది. రోజూ లాగే బెంగపడుతూ ఇంటి కొచ్చి తడిక తోసుకుని గోలెం పక్కన సత్తు చెంబు పడేశాడు రెడ్డి. మూడు తడికల అడ్డుతో గోలేనికి అవతలగా స్నానాల గదిలో పెద్ద కుండతో నీళ్లు సిద్ధంగా ఉన్నాయి. తండ్రి రావడం చూసి కూతురు తుండుగుడ్డా లుంగీ తడిక మీదవేసి వెళ్లిపోయింది. నెత్తిమీద మిగిలిన రెండు డజన్ల తెల్ల వెంట్రుకల మీంచీ చల్లటి నీళ్లు పోసుకుంటూ 'కాపాడు సావీ కాపాడు సావీ' అనుకుంటూ రెడ్డి స్నానం మొదలు పెట్టేడు. ఆదరాబాదరా బయటి కొచ్చి నాలుగు పూలుకోసుకుని బనీను తొడుక్కుంటూనే ఆశ్రమానికి బయల్దేరే డతను. ఉదయపు ఎండ పూర్తిగా పరుచుకోలేదు.

స్వామి పేరు స్మరిస్తూ వేగంగా భక్తిగా ఇంటి గొందిదాటిరోడ్డు మీదికి ఒచ్చేడు రెడ్డి. ఆశ్రమం నుంచి పాటలు వినిపిస్తున్నాయి. రెండు నిముషాల్లో ఆశ్రమం చేరి చెప్పులు గోడ దగ్గిర విడిచి కాళ్లు పంపు దగ్గిర కడుక్కుని వరాండాలో ఉన్న పెద్ద విభూతి పండుతో ముఖం మీద బొట్టు పెట్టుకుని వెనక ఉన్న స్వామి మందిరం వేపు వెళ్లేడు. తిరుపతి నుంచి రెండుకుటుంబాలవారు వచ్చి స్వామితో మాట్లాడుతున్నారు. ఇరవై నిమిషాల తరవాతగానీ లోపలికి వెళ్లలేకపోయాడు రెడ్డి.

ఒంగి కాళ్లకి దణ్ణం పెట్టి పూలు పాదాల దగ్గిర పెట్టి కూచున్నాడు రెడ్డి. ఆశీర్వదిస్తూ అతని వేపు చూసి నవ్వేరు స్వామి.

"సావీ నువ్వేమో నన్నొదిలేస్తివి. చస్తా ఉండాను బిడ్డకి పెళ్లి జెయ్యాల. ఏణ్ణుంచి తెచ్చేది పైకం? మా రెడ్డోళ్లు ఊరకనే పిల్లని దీసికెల్తారా? ఇంకా ఏడిపించమాక సావీ. నువ్వందరికీ చేస్తా ఉండావు. నేనేం పాపం జేశా? నన్ను కాపాడు నాయనా.... నా యేపారం మూలబడిపాయ, నన్ను పట్టించుకుంటావా లేదా?"

రోజూ దణ్ణం పెట్టి వెళ్లిపోవడం తప్ప రెడ్డి గత నెల రోజులుగా ఏవీ మాట్లాడ్డం లేదు.రెండు చేతులా ఎత్తి దణ్ణం పెట్టేడు. కళ్లనిండా నీళ్లు తిరిగేయి. పక్కనే ఉన్న పళ్లెంలోంచి రెండు పళ్లు తీసి అతనికిచ్చి తల మీద చెయ్యి పెట్టి మరోసారి ఆశీర్వదించేడు

స్వామి. కళ్లు తుడుచుకుని లేచి నుంచుని మరోసారి దణ్ణం పెట్టి బయటికి నడిచేడు రెడ్డి.

ఆవరణలో చెట్టుకింద పెద్ద రాతి వినాయకుణ్ని ప్రతిష్టించారు స్వామీజీ. రెడ్డి మూడుసార్లు ప్రదక్షిణం చేసి మెల్లిగా బయటి గుమ్మం వేపు నడుస్తూ చెట్టు కింద ఆగిపోయాడు. అప్పటికే ఉదయం దర్శనం కోసం జనం వస్తూనే ఉన్నారు. సరే బయల్దేరదావని రెండడుగులు వెయ్యగానే లోపలికొస్తూ లింగప్ప కనిపించేడు. తెల్లటి అడ్డపంచె, అంతే తెల్లని కండువా లింగప్పని చూడగానే బాగాఎర్రగా కాలిన రవ్వదోశ గుర్తొస్తుంది రెడ్డికి. దాంతోపాటు కోపం, బెంగ. లింగప్ప ఇతన్ని చూడలేదు. లోపలికి వెళ్లిపోయాడు. అతను వెళ్లినవేపే చూస్తూ క్షణం ఆగి బయటికి నడిచేడు రెడ్డి. రోడ్డు మీదికెళ్లి ఇంటివేపు వెళ్లకుండా అద్దాలు, గాజులు, ఫోటో కొట్టు దాటి ముందు వెళ్లే దతను అక్కడ రోడ్డు పెద్ద వంపు తిరిగి ముందుకు పోయి ఫర్లాంగు తరవాత ఊళ్లోంచి బయటికి పోతుంది. ఆ ఒంపు కింది ఖాళీ స్థలంలో బస్సులు ఆగుతాయి.

"కందుకూరు పోతాండా" తన వెనక నుంచి గబగబ పరుగులా నడుస్తూ ఊరెళ్తున్నానని చెప్తూనే బస్సుకోసం పరిగెట్టేడు కోమటి సూర్నారాయణ. రెడ్డికి ఎడంవేపు కేసెట్ల కొట్టు, బొమ్మల కొట్ల మధ్యనల్లటి బోర్డు మీద కొత్త తెల్లటి అక్షరాలు మెరుస్తున్నాయి "ఉడిపి కాఫీ హోటలు". ఓ మాదిరి ఆరు టేబిళ్ల గది. బయటికి అప్పుడే అగరొత్తుల పరిమళం తెలుస్తోంది. మరో అరగంటలో చోటు దొరక్క బయట నిలబడతారు. ఏకంగా గుండెల మీద రవ్వట్టు పోసినట్టయింది రెడ్డికి. మనసులో రెండు బూతులు తిట్టుకుని హోటలు దాటి చుట్టుదారిన ఇంటి కొచ్చేడు. లోపలి కెళ్లేసరికి, అప్పటికే ఒకాయన ఒంటిమీద చొక్కాలేదు,తువాలు కప్పుకుని ఇడ్లీ తింటున్నాడు. కొత్త హోటలు తెలీదు గావాల్న అనుకున్నాడు రెడ్డి. కూతురు చెట్నీ రుబ్బుతోంది. భార్య దోశ పోస్తోంది.

కందుకూరికి ఇరవై కిలోమీటర్ల దూరంలో కొండవాగు పక్కన పరుచుకున్న గ్రామం శనక్కాయలపాడు. గ్రామం మొదట్లో ఊళ్లోకివచ్చే రోడ్డు మీదపెద్ద సిమెంటు కమాను దానికి రెండువేపులా శనక్కాయలపాడు అవధూత రంగు బొమ్మలు ఊరి జాతకాన్ని తిరగరాసిన గుర్తులు. ఊరికి ఒక పక్క పొడుగ్గా మొలిచిన శివాలయ గోపురం చూపుడు వేలు లాగ గ్రామం పిలుస్తున్నట్టుం టుంది. ఇష్టం ఉండి వర్షం పడితే పండినట్టు లేకపోతే పొలాలన్నీ చచ్చిన గొడ్ల చర్మాల్లా నిర్జీవం. వర్షం వల్ల కాని పని స్వామి వల్ల కొంత అయింది. అయిదేళ్ల క్రితం పాత చెరువు పక్కన పెద్ద బావి తవ్వించారాయన. నీటి బుగ్గపొంగి ఊరికి దప్పిక లేకుండా చేసింది. దగ్గిర దూర ప్రాంతాల్లో అవధూతపేరు తెలియని వారుండరు. అన్ని చోట్ల నుంచి జనం వస్తూంటారు. వార్తాపత్రిక మీద ఈగలాంటి

శనక్కాయలపాడు స్వామి వల్ల క్షేత్రం అయింది. ఉదయ సాయంత్రాలు భక్తిగీతాలు, రాత్రిళ్లు భజనలు, ఊరంతా అగరొత్తుల పరిమళంలో కలిసిపోయిన భక్తి ఆవరించి ఉంటుంది. స్వామి ఫోటోలు, భక్తి పాటలు, దేవుళ్ల ఫోటోలు, అవధూతల జీవిత చరిత్రలు, చిన్న చెప్పుల దుకాణం, బట్టలకొట్టు, కనీసం నాలుగు టీ కొట్లు వగైరా గ్రామాన్ని కొంత ఆదుకున్నాయి. బస్సులు ఎక్కువ పడ్డాయి. కందుకూర్నించి వేలకొద్దీ జనం శనక్కాయల పాడుని ముంచెత్తుతూంటారు. స్వామి పుట్టిన ఇల్లు, చదివిన బడీ దర్శనీయస్థలాలు.

పెద్దకూతురి పెళ్లి చేసిన తరవాత ఒక్కసారి కూడా సరిగా పంటచేతికి రాలేదు. చేసిన అప్పులు నెత్తి మీద కుంపట్లయినాయి. రెడ్డి కుదేలయి పోయిం తరవాత జరుగుబాటు కష్టం అయింది. కూలినాలికి వెళ్లలేదు. స్వామికి ఎన్ని దణ్ణాలు పెట్టినా ఏవీ చెయ్య లేదు. పని సాయం చేసినట్టూ ఓ పూట గడిచినట్టూ ఉంటుందని రెడ్డి ఆశ్రమం వంటశాలలో పని కల్పించుకునేవాడు. కట్టెలు విరిచేవాడు. ఒకరోజు తిరుపతి నుంచి భక్తులు బస్సు నిండా దిగేరు. గబగబ అన్నం వడ్డిస్తున్నాడు. స్వామి ఎందుకో మందిరంలోంచి బయటికి వచ్చి చెట్టు కింద నుంచున్నాడు. ఎదురుగా భోజనశాలలో వడ్డిస్తూ రెడ్డి కనిపించేడు. ఆ రోజు సాయంకాలం రెడ్డికోసం కబురుపెట్టేరాయన. పాదాలకు దణ్ణం పెట్టికూచున్నాడు రెడ్డి.

"ఏంది సావీ?"

స్వామి నవ్వి పక్కనే ఉన్న పళ్లెంలో ఉన్న నోట్లు గుప్పిట పట్టి రెడ్డికిచ్చేరు. ఇంటికెళ్లి లెక్కపెడితే వెయ్యి పైనుంది. మొహం వెలిగిపోతూండగా భార్యకిచ్చేడు రెడ్డి. ఇంట్లోనే ఇడ్లీ దోశల్లాంటివి చేసి ఒచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండేటట్ట వ్యాపారం చెయ్యమని చెప్పేరు స్వామి. గుంజకి వేలాడదీసిన స్వామి ఫోటోకి అగరొత్తులు వెలిగించి మూడో రోజు నుంచీ ఇడ్లీ వ్యాపారం మొదలుపెట్టేడు రెడ్డి. నులకమంచం మీద దుప్పటిపరిచి, ఓ పాత చెక్క బెంచీ వేసి భక్తులకి ఆకుల్లో ఇడ్లీలు అందించేడు. గడచినేడాదిన్నర నుంచీ ఇబ్బందిలేకుండా గడిచి ఇంక మరో ఏడాదిలో వడ్డీలు కట్టుకోవచ్చుననుకున్నాడు. చివరి ఆర్నెల్లూ రాత్రిళ్లు ఉండిపోయిన భక్తులకి రొట్టెలు అన్నం కేరియర్లు ఏర్పాటు చేయ్యడంతో రెడ్డికి ఒంటిమీద వర్షం పడ్డంత హాయిగా వుంది.

చెట్నీలో బొద్దింక పడ్డట్టు లింగప్ప చల్లగా తెల్లగా ఊళ్లోకి దిగేడు. లింగప్ప కన్నడంలో రెండు సినిమాలు తీసి డబ్బు బాగానే సంపాదించాడు. ఒక అరవ సినిమా కన్నడంలోకి, తెలుగులోకి తీసిం తరవాత ఉన్న ఇల్లు పోయింది. హీరోయిన్‌తో మూడు సార్లు సింగపూర్ వెళ్లి రావడంచేత మిగిలిన డబ్బూ హీరోయిన్ చేజారిపోయింది. భార్యనీ, చిన్న సూట్‌కేసునీ తీసుకుని కన్నడ రాష్ట్రం ఒదిలేశాడు లింగప్ప. స్వామి దర్శనంచేసుకుని, వచ్చిన అయిదో

రోజు హోటలు గది అద్దెకి తీసుకున్నాడు. రోజూ సూర్యోదయంతోపాటు స్వామి దర్శనంచేసుకుని ఆయన ఆశీస్సులు నెత్తిమీద పెట్టుకుని వెడతాడు లింగప్ప. స్వామి ఫోటోకి దణ్ణంపెట్టి, పూలు పెట్టి మొదటి ప్లేటు ఇడ్లీ అమ్మేదతను. రెండోరోజు నుంచే ఉడిపి రుచి ఊరినోటంతా నిండింది. రాత్రి తలుపులు వేసే వరకూ హోటలంతా 'ప్లేటిడ్లీ ఉల్లి రవ్వ'ల కేకలతో నిండిపోతోంది. రెడ్డికికొంచెం ముందు వెనకలుగా రెండు పూట్లా స్వామి దర్శనం చేస్తాడు లింగప్ప.

అట్లా లింగప్ప రెడ్డి నోట మాడిపోయిన దోశ కొట్టేడు. రెడ్డికి కడుపు లోంచి ఏడుపొచ్చింది. అతని వ్యాపారం సన్నగిలి పోయింది. ఊళ్లో వాళ్లు కూడా లింగప్ప హోటలు దారి పట్టేరు. మళ్లీ కుదేలయిపోయేడు రెడ్డి. చాలాసార్లు స్వామితో గొడవపడ్డాడు. ఏడిచేడు. "నా నోట మట్టి కొట్టేవుగద సామీ"

"నేనేం చెయ్యను?"

"ఆడెవడో బయటోణ్ని రప్పిస్తివే. నా నోటికాడ కూడు బోలే సావీ? నిన్నే నమ్ముకుంటినే. ఏం జెయాల ఇప్పుడు?"

"లింగప్పని రమ్మని చెప్పినానా, పొమ్మని చెప్పటానికి?"

ఈలోగా లింగప్ప రాత్రిళ్లు చపాతీలు మొదలుపెట్టడంతో రెడ్డి కడుపు పూర్తిగా డొక్కల్లోకిలాగేసింది. నెత్తీనోరూ కొట్టుకున్నాడు.

"సావికి మనం కానోళ్లం అయిపోయినం" భార్య ఏవీ అనలేకపోయింది. తండ్రికి ధైర్యం చెప్తూ, నులక మంచం మీద వాలిపోయిన రెడ్డి కాళ్లు మెల్లిగాపడుతూ మందలించింది కూతురు.

"నానా, ఈ టెన్తు అయిపోంగనే కందుకూర్లో ఉజ్జోగం జేస్తా. దిగులుపడమాక"

❖ ❖ ❖